హైదరాబాద్ జయభేరి

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా మూడు పరాజయాల అనంతరం హైదరాబాద్ గెలుపు బాట పట్టింది. ఆదివారం జరిగిన పోరులో హైదరాబాద్ 30 పరుగుల తేడాతో (వీజేడీ పద్ధతిలో) విదర్భను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన విదర్భ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (102 నాటౌట్) సెంచరీతో ఆకట్టుకోగా.. ధ్రువ్ షౌరే (83) రాణించాడు. మన బౌలర్లలో కార్తికేయ, నితిన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 29 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 159 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (77 నాటౌట్), రాహుల్ సింగ్ (62 నాటౌట్) అర్ధ శతకాలతో రాణించారు. ఈ దశలో మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడగా.. హైదరాబాద్ లక్ష్యాన్ని 29 ఓవర్లలో 130 పరుగులుగా నిర్దేశించారు. అప్పటికే ఆ మార్క్ దాటేయడంతో హైదరాబాద్‌ను విజేతగా ప్రకటించారు.

రన్నరప్ పొన్నప్ప జోడీ

లక్నో : సయ్యద్ మోడీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో భారత జోడి తనీష క్రాస్టా, అశ్విని పొన్నప్ప ద్వయం రన్నరప్‌తో సంతృప్తి చెందింది. ఆదివారం జరిగిన ఫైనల్లో తనీష-అశ్విని 14-21, 21-17, 15-21తో జపాన్ జోడి రిన్ ఇవనగ-కీ నకనిషి చేతిలో ఓడిపోయారు. తొలి గేమ్‌ను కోల్పోయిన తనీష-అశ్విని రెండో గేమ్‌ను గెలుచుకుని పోటీలో నిలిచారు. అయితే జపాన్ జోడి నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆరంభంనుంచి ఆధిక్యం ప్రదర్శించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఇతర ఫైనల్స్‌లో చిన్ యు జెన్ 20-22, 21-12, 21-17తో జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటోపై గెలుపొంది పురుషుల సింగిల్స్ టైటిల్‌ను, జపాన్‌కు చెందిన నజోమి ఒకుహర 21-19, 21-16తో డెన్మార్క్‌కు చెందిన లినె హోజ్ మార్క్‌ను ఓడించి మహిళల సింగిల్స్ టైటిల్‌ను, ఇండోనీసియాకు చెందిన చూంగ్ హాన్ జియాన్-హైకల్ ముహ్మద్ 18-21, 21-18, 21-16తో జపాన్‌కు చెందిన అకిరా కోగ-తయూచి సైటొలపై విజయంతో పురుషుల డబుల్స్ టైటిల్‌దక్కించుకున్నారు.

పాక్‌తో సిరీస్‌కు వార్నర్

సిడ్నీ : పాకిస్థాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు వెటరన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌ను తొలి టెస్టుకు జట్టులో ఎంపిక చేశారు. పాక్‌తో జరిగే సిరీస్‌తో వార్నర్ టెస్టులకు వీడ్కోలు చెప్పనున్నాడు. అయితే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతానని తెలిపాడు. సిడ్నీలో జరిగే మూడో టెస్టులో వార్నర్‌కు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. పాట్ కమిన్స్ నేతృత్వంలో 14మంది సభ్యుల జట్టును ఆదివారం ప్రకటించారు. తొలి టెస్టు ఈనెల 14నుంచి పెర్త్‌లో, రెండో టెస్టు 26నుంచి మెల్‌బోర్న్‌లో, మూడో టెస్టు జనవరి 3నుంచి సిడ్నీలో జరుగనున్నాయి. సిరీస్‌కు ముందు పాకిస్థాన్ ప్రైమ్ మినిస్టర్ లెవెన్‌తో నాలుగు రోజుల మ్యాచ్‌లో తలపడుతుంది.

యువోత్సాహం

చివరి టీ20లో భారత్ గెలుపు • 4-1తో సిరీస్ కైవసం • మెరిసిన శ్రేయస్, అక్షర్

సీనియర్ల గైర్హాజరీలో యువ ఆటగాళ్లతో నిండిన భారత జట్టు కంగారూలపై పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన చివరి మ్యాచ్‌లో యంగ్‌ఇండియా అదరగొట్టింది. సహచరులు విఫలమైన చోట శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకంతో సత్తాచాటి జట్టుకు పోరాడే స్కోరు అందించగా.. బౌలింగ్‌లో ముఖేశ్ కుమార్ దుమ్మురేపాడు. ఛేదనలో ఆసీస్ తుదికంటా పోరాడినా.. స్పిన్ ద్వయం అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ కంగారూలను కట్టడి చేశారు.

బెంగళూరు: వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. రెండు వారాలు తిరిగేసరికి అదే కంగారూలపై టీ20 సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌కు ముందే కప్పు ఖాతాలో వేసుకున్న భారత్.. ఆదివారం జరిగిన చివరి పోరులో 6 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (37 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. అక్షర్ పటేల్ (31), జితేశ్ శర్మ (24), యశస్వి జైస్వాల్ (21) పర్వాలేదనిపించారు. రుతురాజ్ గైక్వాడ్ (10), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5), రింకూసింగ్ (6) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెహ్రాన్‌డార్ఫ్, బెన్ డ్వార్షెచెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేసింది. మెక్ డర్మాట్ (54; 5 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించగా.. ట్రావిస్ హెడ్ (28), కెప్టెన్ మాథ్యూ వేడ్ (22) పోరాడారు. జోస్ ఇంగ్లిస్ (4), ఆరోన్ హార్డీ (6) విఫలమయ్యారు. భారత బౌలర్లలో ముఖేశ్ కుమార్ 3, అర్ష్‌దీప్, రవి బిష్ణోయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌లో 31 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో తన కోటా నాలుగు ఓవర్లలో కేవలం 14 పరుగులే ఇచ్చి ఓ వికెట్ తీసిన అక్షర్ పటేల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. సిరీస్ ఆసాంతం రాణించి 9 వికెట్లు తీసిన యువ స్పిన్నర్ రవికి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 160/8 (శ్రేయస్ 53, అక్షర్ 31; బెహ్రాన్‌డార్ఫ్ 2/38), **ఆస్ట్రేలియా:** 20 ఓవర్లలో 154/8 (మెక్‌డర్మాట్ 54; ముఖేశ్ 3/32).

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ (31; 1/14)

ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ రవి (2/29)

19 అంతర్జాతీయ టీ20ల్లో ఆస్ట్రేలియాపై భారత్‌కు ఇది 19వ విజయం. ఒక ప్రత్యర్థిపై టీమ్‌ఇండియాకు ఇదే అత్యధికం.

1 భారత్ తరఫున ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక (9) వికెట్లు తీసిన బౌలర్‌గా రవి బిష్ణోయ్.. అశ్విన్ సరసన చేరాడు.

దబాంగ్‌పై తలైవాస్ గెలుపు

అహ్మదాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్‌లో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 42-31 స్కోరుతో ఢిల్లీ దబాంగ్‌ను మట్టికరపించింది. తలైవాస్ జట్టులో అజింక్య పవార్ అత్యధికంగా 21 పాయింట్లు సాధించి జట్టు విజయానికి దోహదం చేశాడు. నరేందర్ 8, అభిషేక్, హిమాంశు, సాహిల్ రెండేసి పాయింట్లు సాధించారు. కాగా ఢిల్లీ జట్టులో నవీన్ కుమార్ 14, అశు మాలిక్ 9, హిమ్మత్, విశాల్ రెండేసి పాయింట్లు సాధించారు. ఉత్కంఠగా ముగిసిన మరో పోరులో గుజరాత్ జెయింట్స్ 34-31తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. గుజరాత్ జట్టులో సోను 12, రాకేష్ సొంబీర్ చెరి 5, అర్కమ్మ, రోహిత్ చెరి 3, నబిబక్ష్ 2 పాయింట్లు సాధించగా, బెంగళూరు జట్టులో భరత్ 7, వికాస్ 6 పాయింట్లు సాధించారు.

చాంప్ రామ్‌కుమార్

న్యూఢిల్లీ: భారత యువ టెన్నిస్ ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ మూడో ఐటీఎఫ్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన కలబుర్గీ ఓపెన్‌లో రామ్‌కుమార్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రామ్‌కుమార్ 6-2, 6-1తో డేవిడ్ పిచ్లెర్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. 64 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో రామ్‌కుమార్ వరుస సెట్లలో విజృంభించాడు. గత రెండు నెలల్లో రామ్‌కుమార్‌కు ఇది మూడో ఐటీఎఫ్ టైటిల్ కావడం విశేషం.

2029 ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలకు భారత్ బిడ్!

అమృత్‌సర్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ ఉత్సాహం చూపుతున్నది. 2029 జరిగే మెగాటోర్నీ కోసం భారత్ బిడ్ వేయాలని భావిస్తున్నది. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) మొదట 2027 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆతిథ్యానికి పోటీ పడాలని భావించినా.. ఆ తర్వాత దాన్ని 2029కి మార్చుకున్నట్లు ఏఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు అంజూ బాబ్ జార్జ్ వెల్లడించింది. మరోవైపు 2036 ఒలింపిక్స్ నిర్వహణపై కూడా భారత్ దృష్టి పెట్టడంతో.. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆతిథ్యమివ్వడం దేశంలో క్రీడలకు మరింత ప్రధాన్యత తీసుకొస్తుందని ఆమె పేర్కొంది.

ఇంగ్లండ్-'ఎ' దే టీ20 సిరీస్

ముంబై : ఇండియా-ఏతో జరిగిన టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్-ఎ 2-1తో గెలుచుకున్నది. ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ ఇస్సీ వాంగ్ ప్రతిభతో ఇంగ్లండ్ జట్టు రెండు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ఇండియా-ఎ 19.2 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌటయింది. ఉమా చెత్రి (21) టాప్ స్కోరర్. ఇస్సి వాంగ్ 18 పరుగులకు 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం ఇంగ్లండ్-ఎ 19.1 ఓవర్లలో 8 వికెట్లకు 104 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.